# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రవాస భారతీయులు దేశ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2.** **ప్రకృతి వ్యవసాయ విధానాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడిని పండించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3.** **తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా విజన్-2047 ప్రణాళికను రూపొందించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, కె పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు.**

**5.** **స్వాతంత్రసమర యోధులు అల్లూరి సీతారామరాజు జయంతి ఈరోజు.**

==========================

ప్రవాస భారతీయులు దేశ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ట్రీనికాడ్, టోబాగోలో పర్యటిస్తోన్న ప్రధానమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. విదేశాలకు వలస వచ్చినప్పటికి దేశ విలువలను పాటించడంలో వారు సఫలీకృతమయ్యారని తెలిపారు. కాగా.. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి గతరాత్రి ట్రీనికాడ్ టోబాగోలోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌కు చేరుకున్నారు.

--------------------------

ప్రకృతి వ్యవసాయ విధానాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడిని పండించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు, పల్ప్ పరిశ్రమల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మామిడి గుజ్జు పై వస్తుసేవల పన్ను – జీఎస్టీ తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని పేర్కొన్నారు.

--------------------------

తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా విజన్-2047 ప్రణాళికను రూపొందించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని పారిశ్రామికవాడలో ఒక ప్రయివేటు నగల సంస్థ

తయారీ కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుందని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి తెలుపుతూ,

వాయిస్ .. 32 సెకెను

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, కె. పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలో 1290 కోట్ల రూపాయలతో చేపట్టే తాగు నీటి పథకం పనులకు నరసింహపురం గ్రామంలో శంకుస్థాపన చేస్తారు. ఈ పథకం కింద 10 లక్షల మందికి తాగు నీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, సహాయశాఖ మంత్రి సతీశ్‌చంద్ర దూబేలు అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో 'మూతపడిన గనుల్లో పచ్చదనం అభివృద్ధి, స్థానికులకు జీవనోపాధి' అనే అంశాలపై సింగరేణి కాలరీస్ కంపెనీ, కోల్ ఇండియా లిమిటెడ్‌లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థతో కేంద్ర మంత్రి సమక్షంలో నిన్న అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరిగిన గనుల తవ్వకాలలో బొగ్గు తవ్వేసిన 143 ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గనుల ప్రాంతాల్లోని రైతుల భూముల్లో సారాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నామని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. ఇటీవల రాయచోటిలో ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని తమిళనాడు ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఐజీ నిన్న వెల్లడించారు. పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని, సేకరించిన ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఈ సందర్భంగా డీఐజీ తెలుపుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మన్యం వీరుడిగా బ్రిటీష్ వారిపై పోరాడిన స్వాతంత్రసమర యోధులు.. గిరిజన హక్కులకోసం అలుపెరగని పోరాటం చేసిన రంప విప్లవవీరుడు, అల్లూరి సీతారామరాజు జయంతి ఈరోజు. 1897 జులై 4వ తేదీన విశాఖజిల్లా పాండ్రంగిలో జన్మించిన సీతారామరాజు పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో విద్యాభ్యాసం చేశారు. గిరిజనుల కోసం ఆయన జరిపిన పోరాటం భారత చరిత్రలో ప్రధానఘట్టంగా నిలిచిపోయింది. బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టి కాల్పులు జరిపిన సంఘటనలో 1924 మే 7వ తేదీన అల్లూరి సీతారామరాజు అమరుడయ్యారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు పనులను 2027 నాటికి పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని గత సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దెబ్బతిన్న డయాఫ్రంవాల్ స్థానంలో కొత్త నిర్మాణం జనవరిలో ప్రారంభించి ఇప్పటి వరకు 360 మీటర్ల మేర పూర్తి చేశామని వివరిస్తూ...

వాయిస్ ..20 సెకన్లు

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతాక రూపశిల్పి... పింగళి వెంకయ్య వర్ధంతి ఈరోజు. 1876, ఆగస్టు 2న ఆయన కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ 1921 మార్చి 31, ఏప్రిల్ 1న విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఆ పతాకానికి కొద్దిగా మార్పులు చేశారు. పింగళి వెంకయ్య అందించిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2009లో తపాలా బిళ్ళను విడుదల చేయడంతో పాటు విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి ఆయన పేరు పెట్టారు. పింగళి వెంకయ్య 1963 జూలై 4వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

పేదరికాన్ని తగ్గించేందుకు స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని విజయనగరం జిల్లా ఇన్చార్జి మంత్రి వి. అనిత తెలిపారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక, పి4 కార్యక్రమాలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి వచ్చే ఐదేళ్లకు ఒక ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాకు వ్యవసాయాధారిత పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

రుతుపవన ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరువర్షాలు కురుస్తాయని తెలిపింది.

=====================